క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ఒంగోలు సబర్బన్: నగరంలోని ట్రంక్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఒంగోలు నగర డీఈఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రకాశం భవన్ మొదలుకొని ట్రంక్ రోడ్డుతో పాటు ధారావారి తోట, భాగ్యనగర్ ఒకటి, రెండు, మూడు లైన్లలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

కేజీ పొగాకు ధర రూ.242

ఒంగోలు రూరల్: ఒంగోలు వేలం కేంద్రం-2లో పొగాకు కిలో ధర రికార్డు స్థాయిలో రూ.242 పలికింది. నాణ్యమైన గ్రేడు-1 పొగాకు లభ్యం కావడంతో గరిష్ట ధరకు కొనుగోళ్లు జరిగాయి. 562 బేళ్లు రాగా, 538 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. నోబిడ్ బేళ్లు 6 కాగా గరిష్ట ధర రూ.242, కనిష్ట ధర రూ.175, సరాసరి ధర రూ.218.06 గా నమోదయినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

దివ్యాంగునికి మూడు చక్రాల సైకిల్ అందజేత

ఒంగోలు అర్బన్: సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుడు మురళికి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు. బాపట్ల జిల్లా చినగంజానికి చెందిన మురళి పూర్తి స్థాయి దివ్యాగులు కావడంతో ప్రవాస భారతీయులు పూనాటి సురేష్ ఆర్థిక సహాయంతో ట్రస్ట్ సభ్యులు ట్రస్ట్ కార్యాలయంలో ట్రైసైకిల్‌ను అందించారు. ట్రస్ట్ సభ్యులు షేక్ సర్దార్ బాష, మండవ సుబ్బారావు, గుడివాడ బాబ్జి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు: కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో కండ్లగుంట సచివాలయ పరిధిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు కిమ్స్ ఆస్పత్రి పీఆర్‌వో షేక్.రఫీ తెలిపారు. మంగళవారం కండ్లగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచ్ పల్లెర్ల అంజిరెడ్డి, ఎంపీటీసీ పాలపర్తి రత్తయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి, గుండె, సాధారణ వైద్యానికి సంబంధించిన 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు.

రెండు వాహనాలు సీజ్

కొమరోలు: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న రెండు వాహనాలను ఇరిగేషన్ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని అక్కపల్లె చెరువులో మంగళవారం జేసీబీ సాయంతో ట్రాక్టర్లకు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈ జయరామయ్య.. పోలీసుల సహకారంతో అక్కపల్లె చెరువులో ఉన్న ట్రాక్టర్, జేసీబీని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ జయరామయ్య హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

కౌలు కార్డులు అందేలా చొరవ చూపాలి

తాళ్లూరు: గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అసిస్టెంట్స్ కౌలు రైతులకు అవగాహన కల్పించి క్రాప్ కల్టివేషన్ సర్టిఫికెట్స్ అందేలా చొరవ తీసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. తాళ్లూరులో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్‌లో తప్పనిసరిగా కౌలుదారులు కార్డులు పొందేలా చూస్తే రాబోవు రోజుల్లో ప్రకృతి విపత్తులు సంభవిస్తే తగిన విధంగా సాయం పొందేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

తాళ్లూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వక్తలు అన్నారు. స్థానిక రైతు భరోసా కార్యాలయంలో మంగళవారం గ్రామ రైతులతో ఆయన సమావేశమయ్యారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న భూ సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం దొరుకుతోందని, రైతులు సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులకు పూర్తి యిలో సహకరించాలని కోరారు. తహసీల్దార్ కేవీ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తయిన చోట డ్రోన్ సర్వే ద్వారా వచ్చిన ఓఆర్ఎల్ షీట్స్ తీసుకుని వీఆర్‌ఓలు రైతుల పొలాలకు వస్తారనని చెప్పారు. తర్వాత రైతు సూచన మేరకు ల్యాండ్ ప్లాన్ మెజర్‌మెంట్ (ఎల్‌పీఎం)లు నమోదై వస్తాయని చెప్పారు. 2022 నవంబర్ 1 ముందు ఉన్న సాధారణ అగ్రిమెంట్స్ పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్‌కు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్పంచి మేకల చార్లెస్ సర్జన్, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్, డీటీ ప్రశాంత్, వీఆర్‌ఓ చంద్ర, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు సోము అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

దర్శి: ఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్, దర్శి ప్రభుత్వ ఆస్పత్రి సంయుక్తంగా బుధవారం కాన్సర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాన్సర్ స్పెషలిస్టు వైద్యులు రఘునందన్ (రేడియోషన్ అంకాలజిస్ట్) వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. వివరాలకు 74167 61641 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


అడ్డంకులను తొలగింపజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు


ఎస్ఎస్ ట్యాంకు-2కు సాగర్ నీరు చేరుతున్న తీరును పరిశీలిస్తున్న కమిషనర్

నగరానికి జలకళ

- సామర్థ్యం మేరకు ఎస్ఎస్ ట్యాంకులకు సాగర్ నీరు
- నీటి ప్రవాహంలో అడ్డంకుల తొలగింపు
- పరిశీలించిన ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులకు రామతీర్థం నుంచి సాగర్ నీరు ముమ్మరంగా వచ్చి చేరుతోంది. ఐదు రోజుల నుంచి రామతీర్థం జలాశయం నుంచి సాగర్ నీరు ఒంగోలు నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులకు వస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు రామతీర్థం నుంచి వస్తున్న నీటిని సాగర్ కాలువ వెంట వచ్చి పర్యవేక్షించారు. సాగర్ కాలువలో నీటి ప్రవాహానికి అక్కడక్కడ పడుతున్న అడ్డంకులను నగర పాలక సంస్థ సిబ్బందితో తొలగింపజేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకు-1, 2లోకి సాగర్ నీరు వచ్చి చేరుతోందన్నారు. ఎస్ఎస్ ట్యాంకు-1లో నీటి గరిష్ట నిల్వ 1950 మిలయన్ లీటర్లు (ఎంఎల్)కి గాను ఈ నెల 9వ తేదీ నాటికి 924.24 ఎంఎల్ నిల్వ ఉండేదన్నారు. ఐదురోజుల్లో సాగర్ నీరు వచ్చి చేరటంతో ప్రస్తుతం 1124.60 ఎంఎల్‌కు పెరిగిందన్నారు. అదేవిధంగా ఎస్ఎస్ ట్యాంకు-2లో గరిష్ట నిల్వ 3750 ఎంఎల్ కాగా ఈ నెల 9వ తేదీ నాటికి 434.32 ఎంఎల్ నీటి నిల్వ ఉందన్నారు. ఐదు రోజులపాటు సాగర్ నీరు వచ్చి చేరటంతో అది కాస్తా ప్రస్తుతం 903,67 ఎంఎల్‌కు చేరుకుందన్నారు. సాగర్ కాలువ ద్వారా నీటి వేగం తగ్గకుండా అక్కడక్కడా ఉన్న అడ్డంకులను తొలగించి మరీ నీటి వేగాన్ని పెంచామన్నారు. మరో 15 నుంచి 20 రోజుల పాటు రామతీర్థం నుంచి నీటి సరఫరా చేయిస్తున్నామన్నారు. నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఎప్పటికప్పుడు సాగర్ నీటి విడుదల విషయంలో ఆరా తీస్తున్నారని పేర్కొన్నారు. ఒంగోలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాలినేని ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ప్రతి రోజూ సాగర్ కాలువను పరిశీలించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించామని కూడా పేర్కొన్నారు. ఈ రెండు ట్యాంకులు నిండిన తరువాత రంగారాయుడు చెరువును కూడా నింపుతామన్నారు. రెండు ఎస్ ఎస్ ట్యాంకుల పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 5700 ఎంఎల్ కాగా ఇప్పటికి 2028.27 ఎంఎల్‌కు చేరుకున్నాయన్నారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాగుంట ఇంట ఆత్మీయ అల్పాహార విందు


కార్పొరేటర్లతో ఢిల్లీలోని తన నివాసంలో ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు: ఢిల్లీలోని మాగుంట నివాసం ఒంగోలు నగర కార్పొరేటర్లతో మంగళవారం సందడిగా మారింది. విజ్ఞాన యాత్రలో భాగంగా ఢిల్లీకి చేరిన కార్పొరేటర్లను ఎంపీ మాగుంట ఆత్మీయంగా అల్పాహార విందుకు ఆహ్వానించారు. దీంతో నగర మేయర్ గంగాడ సుజాతతో పాటు ఇతర కార్పొరేటర్లు మాగుంట నివాసానికి చేరుకున్నారు. ఎంపీ మాగుంటను ఘనంగా సత్కరించారు. అనంతరం పార్లమెంట్ భవనాన్ని సందర్శించారు.

ఇది రైతు ప్రభుత్వం

పాదర్తి (కొత్తపట్నం): రైతులకు అసైన్‌మెంట్ భూమి ఇవ్వాలన్నా, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నా, చుక్కల భూమి పరిష్కారం చేయలన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పాదర్తి సర్పంచ్ కట్టా సౌంధర్య భర్త శేఖర్ అన్నారు. పాదర్తి గ్రామ సచివాలయంలో మంగళవారం చుక్కల భూముల హక్కు పత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. 70 ఏళ్ల నుంచి ఎంతో మంది సీఎంలు, ప్రధాన మంత్రులు, ఎమ్మెల్యేలు మారినా.. ఒక్కరు కూడా చుక్కల భూముల గురించి పట్టించుకోలేదన్నారు. కానీ సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములను పరిష్కారం చేయటం ఎంతో అభినందనీయమన్నారు. పాదర్తి గ్రామంలో 402.21 ఎకరాలకు 362 మంది రైతులకు భూహక్కు పత్రాలు శేఖర్, గుడి నాగిరెడ్డి, మూగ బాలాజీ చేతులతో పంపిణీ చేశారు. మూగా బాలాజీ, గ్రామస్తులు, వీఆర్వో బాబురావు పాల్గొన్నారు.


పాదర్తిలో చుక్కల భూములకు భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న శేఖర్

వలంటీర్లకు సేవా పురస్కారాలు


మదనూరులో వలంటీర్లను సత్కరిస్తున్న అధికారులు, గ్రామస్తులు

మదనూరు (కొత్తపట్నం): పల్లెలకు వలంటీర్ సేవలు ముఖ్యమని, ప్రజలకు ఇప్పటికే అనేక సేవలు అందిస్తున్నారని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత కొనియాడారు. మడనూరు పంచాయతీ పరిధిలో రెండు సచివాలయాల వలంటీర్లకు మంగళవారం అభినందన సత్కార సభను ఏర్పాటు చేశారు. సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సచివాలయాలకు వలంటీర్లు కీలకమన్నారు. 232 మంది సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రులు సాధించారన్నారు. మంగళవారం అల్లూరు సచివాలయం 1,2, మడనూరు 1,2 రంగాయాపాలెం, గమళ్ళపాలెం, మోటుమాల, గుండమాల సచివాలయాల్లో వలింటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, సంకువారిగుంట సర్పంచ్ కె.సుబ్బరత్నమ్మ, మడనూరు వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి, చక్రవర్తి, సచివాలయం కన్వీనర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు


విద్యార్థినికి స్వీట్ తినిపించి అభినందిస్తున్న జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఆవుల వెంకట రమణారెడ్డి

శ్రీ ప్రతిభ ప్రభంజనం

ఒంగోలు: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో నందికంటి వెంకట తరుణ్ క్రిష్ణ 465, కళ్లగుంట పూజిత 465, కసుకుర్తి ప్రతిమ 465, దాసరి మమత 465 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో తురిమెళ్ల దుర్గాప్రసన్న 433, చిన్నపురెడ్డి వైష్ణవి, బత్తిన స్వాతి 432, కుంచాల మౌనిక 430 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీఈసీలో నర్రా ప్రియ 477 మార్కులు సాధించారని, 465 మార్కులు నలుగురికి, 464 మార్కులు 12 మందికి, 463 మార్కులు 7గురికి, 462 మార్కులు 8 మందికి, 461 మార్కులు 8 మందికి, 460 మార్కులు 8 మందికి వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు అధ్యాపకులను అభినందించారు.

శ్రీసరస్వతి విద్యార్థుల విజయదుందుభి

తమ కాలేజీ విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో విజయదుందుభి మోగించారని శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఆవుల వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ కె.సాయికిరణ్, యస్.సాహిత్య, పి.కృష్ణకుమారి, ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 466/470 మార్కులు సాధించారని తెలిపారు. వి.జెనీలియా 433/470 మార్కులు సాధించారన్నారు.

ఉమామహేశ్వర విజయకేతనం

ఇంటర్ అడ్వాన్స్ మరియు సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఉమామహేశ్వర జూనియర్ కాలేజీ డైరెక్టర్లు సి.మల్లేశ్వరరావు, సి.జయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో వి.సాయిస్వర్ణ కౌశల్ 465, ఎస్.కె సమీరా 465, పి.చైతన్య గుప్త 463, ఎం.వర్షిణి 463, ఎం.వెంకట మమత 462, ఎం.భవాని 461 , బైపీసీలో యు.అఖిల 429, ఎల్,లక్ష్మీ విష్ణుప్రియ 420, ఎంఈసీ విభాగంలో కె.సాయిశృతి 490, ఎ.తేజశ్రీ 488 అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు.

సత్తాచాటిన శ్రీనాగభైరవ

తమ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారని శ్రీనాగభైరవ ఐఐటీ జేఈఈ- నీట్ అకాడమీ చైర్మన్ నాగభైరవ వీరబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27మందికి పైగా విద్యార్థులు 400కుపైగా మార్కులు సాధించి సంచలనం సృష్టించారన్నారు. వేలూరి దివ్యశ్రీ 463/470 మార్కులు అత్యధికంగా సాధించినట్లు తెలిపారు.

శ్రీ హర్షిణి ప్రభంజనం

ఇంటర్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు ప్రభజనం సృష్టించారని శ్రీ హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ విభాగంల మంగల సౌమ్య 464/470, పిజ్జా బేగం , చప్పిడి స్ఫూర్తి, లాంశరణ్య 463/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఆవుల అర్చన, దేవరకొండ ప్రియాంక 430/440, ఎంఈసీ విభాగంలో చీదెళ్ల నిఖిల చాందిని 477/500, మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

జాహ్నవి సంచలనం

ఒంగోలు: ఇంటర్ బెటర్‌మెంట్ పరీక్ష ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు సంచలనం సృష్టించారని జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మంచి మార్కులు సాధించిన బి.సుప్రజ 464, ఎం.పవన్ దివ్వేష్ 461, ఎస్.కె ఆయేషాబేగం 460, బైపీసీ డి.డానియేలు, ఐ.రాజిత, ఎస్.కె ఉజర్ అహ్మద్ 433, సీహెచ్ అబీనా 432 మార్కులు సాధించారు.

మోదీ ప్రభుత్వంతోనే భవిష్యత్తుకు భరోసా



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్‌కుమార్

ఒంగోలు: ప్రధాని మోదీ సారథ్యంలోనే పేద, బడుగు బలహీనవర్గాలకు ఆర్థిక స్వావలంబన సాధ్యమైందని, మోదీ ప్రభుత్వంతోనే పేద ప్రజానీకం భవిష్యత్తుకు సంపూర్ణ భరోసా ఏర్పడిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఒంగోలు పర్యటనకు వచ్చిన ఆయన ముందుగా స్థానిక చెన్నకేశవస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్థానిక క్విస్ కాలేజీకి చేరుకున్నారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలంతా తోడుంటారన్నారు. 9 సంవత్సరాల బీజేపీ పాలనలో దేశంలో పేద, బడుగు, బలహీనవర్గాల వారికి సమన్యాయం అందించారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్‌లో పేదలకు జరిగిన అన్యాయంపై, వారి పాలనలో జరిగిన హత్యలు, అత్యాచారాలపై తరచూ పోరాటం చేస్తూ వచ్చామని, కానీ నేడు 9 సంవత్సరాల బీజేపీ పాలనలో పార్లమెంట్ సమావేశాల్లో పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక రకాల సంస్కరణలు ప్రధాని మోదీ అమలు చేశారన్నారు. అనంతరం కాలేజీ హాల్‌లో బీజేపీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నగరంలోని పలు షాపింగ్ కాంప్లెక్స్‌లకు చేరుకుని అక్కడకు వచ్చిన వినియోగదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీజేపీ నాయకులు సునీల్ ధియోధర్, నిడమానూరి సూర్య కళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, వాకా నారాయణరెడ్డి, దార సాంబయ్య, పీవీ కృష్ణారెడ్డి, సెగ్గెం శ్రీనివాసరావు, ధనిశెట్టి రాము నాయకుడు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీఓ, సూపర్‌వైజర్లు

పొదిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. మంగళవారం కాటూరివారిపాలెంలో జనభాగీధార్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కేంద్రాల్లో అందించే పోషకాహారం, ఇతర సేవల గురించి వివరించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సావిత్రి, సుభాషిణి, సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం నేడు

ఒంగోలు అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు రెడ్‌క్రాస్ భవనంలో 2022-23లో రక్తదాన ప్రక్రియ, కార్యక్రమాల్లో విశిష్ట సేవలందించిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందిస్తామన్నారు. అదేవిధంగా స్థానిక ఉపాస్ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యధిక సంఖ్యలో రక్త సేకరణ క్యాంపులు నిర్వహించిన మార్కాపురం ఎమ్మెల్యే కుందుర్రు నాగార్జున రెడ్డితో పాటు పలువరురికి అవార్డులు అందిస్తామన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తామని దీనికి కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యమే దివ్యాంగుల ఆయుధం


దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పొదిలి రూరల్: జీవితంలో ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యమే ఆయుధంగా దివ్యాంగులు ముందుకు సాగాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జి.అర్చన పేర్కొన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం పొదిలి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు మంజూరైన నూతన త్రిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, దివ్యాంగుల సంఘం చైర్మన్ ముంతాజ్ పఠాన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘ జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ మాలపోలు శ్యామ్, బత్తిన నరసింహారావు, పొదిలి, కొనకనమిట్ల దివ్యాంగుల సంఘ అధ్యక్షులు దేవళ్లపల్లి ఆంజనేయులు, నుసుం బాలచంద్రుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పుల్లిగొర్ల శ్రీనివాసరావు, ముల్లా జాకీర్, ముల్లా షరీఫా, ముల్లా హసన్‌వలి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఎంఎస్ఆర్ విజయకేతనం

చీమకుర్తి: ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలో చీమకుర్తి ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులతో విజయకేతనం ఎగురవేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో ఎంఎస్ఆర్ కాలేజీకి చెందిన జూనియర్ ఇంటర్ ఎంపీసీలో చుండి భానుదీపిక 470 మార్కులకు గాను 462 మార్కులు, కాపా మణికంఠారెడ్డి 459 మార్కులు, ఎం.హారిక 454 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభను చూపిన విద్యార్థులను కాలేజీ అధ్యాపకులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఒంగోలు రూరల్: ముక్తినూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ రాయపాటి అంకయ్య విద్యార్థులకు జగనన్న కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. మంగళవారం బదీలిపై వచ్చిన హెచ్‌ఎం దేవసేనను ఆహ్వానించారు.


ముక్తినూతలపాడులో జగనన్న కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ రాయపాటి అంకయ్య

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com